సాక్షి తిరుపతి

మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025



సహనానికి సర్వర్ పరీక్ష!

కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సహనాన్ని పరీక్షిస్తోంది. వివిధ పరీక్షల పేరుతో వేధింపులకు గురిచేస్తోంది. - 8లో



ఎర్రమట్టి..కొల్లగొట్టి!

సత్యవేడు నియోజకవర్గంలో మట్టిమాఫియా చెలరేగుతోంది. రాత్రి, పగలు తేడాలేకుండా ఎర్రమట్టిని సరిహద్దులు దాటిస్తోంది. - 8లో



రేషన్ బియ్యం స్వాధీనం

నాగలాపురం తూర్పు దళిత వాడలో అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. 220 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

అభివృద్ధి పనుల పరిశీలన



మన్నసముద్రంలో ఎంపీ గురుమూర్తి

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలంలోని తన స్వగ్రామమైన మన్నసముద్రంలో సోమవారం తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి గ్రామంలో ఎంపీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 238 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న దేవేంద్రరెడ్డి, శోభన్‌బాబు

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు జిల్లా నలు మూలల నుంచి 238 అర్జీలు వచ్చినట్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి తెలిపారు. ఇందులో రెవెన్యూ సమస్యలపైనే 161 అర్జీలు వచ్చినట్టు వెల్లడించారు. ఆయా అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ సుధారాణి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పాల్గొన్నారు.

వేటుకు రంగం సిద్ధం!

తిరుపతి తుడా: ప్రభుత్వ కళాశాలలో, ఆస్పత్రుల్లో పనిచేస్తూ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన అధ్యాపకులపై ప్రభుత్వం వేటుకు రంగం సిద్ధం చేసింది. ఈనెల 10వ తేదీన అలాంటి అధ్యాపకులను గుర్తించి నోటీసులు జారీచేసింది. ఈనెల 24వ తేదీలోపు వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో విధుల నుంచి పూర్తి స్థాయిలో తొలగిస్తామని నోటీసుల్లో హెచ్చరించింది. ప్రభుత్వ వైద్య సంస్థల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లుగా ఉద్యోగాలు పొంది, కొన్ని రోజులకు సెలవులపై వెళ్లడం కొందరికి పరిపాటిగా మారింది. ప్రైవేట్ ఆస్పత్రులను స్థాపించుకుని గవర్నమెంట్ ఆస్పత్రి డిసిగ్నేషన్‌తో డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేసుకుని చలామణి అవుతున్నారు. ప్రభుత్వాస్పత్రులకు దీర్ఘకాలిక సెలవులు పెట్టి సొంత ఆస్పత్రుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారు. సంవత్సరాల తరబడి సెలవుల్లోనే ఉండడం వల్ల పోస్టుల ఖాళీల వివరాలు రికార్డుల్లో చూపడం లేదు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల, రుయా ఆస్పత్రుల్లో 13 మంది వైద్య అధ్యాపకులు దీర్ఘకాలిక సెలవుల్లో సొంత పనుల్లో మునిగితేలుతున్నారు. నోటీసులు అందుకున్న వైద్య అధ్యాపకులు 24వ తేదీలోపు వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.

ఘనంగా తెలుగు వికీపీడియా

తిరుపతి తుడా: తిరుపతి కేంద్రంగా జరిగిన తెలుగు వికీపీడియా పండుగ–2025 ఘనంగా నిర్వహించారు. తెలుగు వికీపీడియా యూజర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కో–ఆర్డినేటర్ కశ్యప్ మాట్లాడుతూ అందరికీ విజ్ఞానాన్ని పంచడమే దీని ప్రధాన లక్ష్యమన్నారు.



హాజరైన ఏపీ, గోవా, మహారాష్ట్ర సీఎంలు



ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

దేవాలయాల పరిరక్షణే లక్ష్యం

దేశంలోని అన్ని దేవాలయాల అనుసంధానం, పరిరక్షణే లక్ష్యంగా అంతర్జాతీయ ఆలయాల ఎక్స్‌పో ఘనంగా ప్రారంభమైంది. తిరుపతి మంగళంలోని ఆశా కన్వెన్షన్ వేదికగా సోమవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు జరగనున్న ఈ కార్యక్రమానికి గోవా, మహారాష్ట్ర, ఏపీ సీఎంలు ప్రమోద్ సావంత్, దేవేంద్ర ఫడ్నవీస్, చంద్రబాబు హాజరయ్యారు. 58 దేశాల్లోని సుమారు 1,581 దేవాలయాలను ఒకే వేదికపై అనుసంధానించడం, భద్రత తదితర అంశాలపై చర్చించారు.
– తిరుపతి సిటీ


కిక్కిరిసిన రుయా



తిరుపతి రుయా ఆస్పత్రి రోగులతో కిక్కిరిసిపోయింది. ఓపీ విభాగం వద్ద రోగులు, వారి సహాయకులతో నిండిపోయింది. వార్డుల ఎదుట ఎటు చూసినా రోగులే కనిపించారు. ఓపీలు పొందిన రోగులు డాక్టర్ల వద్ద క్యూ కట్టారు. ఎక్స్‌రే, ల్యాబ్ కేంద్రాల వద్ద మరింత తాకిడి కనిపించింది. హృదయ ప్రాంగణంలో సరైన వసతులు లేకపోవడంతో గంటల తరబడి రోగులు నిరీక్షించాల్సి వచ్చింది.
– తిరుపతి తుడా

అగ్రి గోల్డ్ మెంట్లు!

ఓ కూటమి నేత అగ్రిగోల్డ్ భూములపై కన్నేశాడు. ఎస్సీ నియోజకవర్గాల్లో ఉన్న వందల ఎకరాలను తన పేరున అగ్రిమెంట్ చేసుకునేందుకు స్కెచ్ వేస్తున్నాడు. ఇందులో భాగంగా ఆయా భూముల్లో సాగులో ఉన్న వృక్ష సంపదను తన అనుచర గణంతో కొల్లగొడుతున్నాడు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధి విస్మయం వ్యక్తం చేస్తుండడం గమనార్హం.



అగ్రి గోల్డ్ ఆధీనంలో ఉన్న ఎగువరాజుపాళెంలోని భూములు

వందల ఎకరాలపై కన్నేసిన కూటమి నేత

- సహకారం అందిస్తున్న రెవెన్యూ
- ఎస్సీ నియోజకవర్గాలే టార్గెట్
- విస్మయం వ్యక్తం చేస్తున్న స్థానికులు, ప్రజాప్రతినిధి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: గూడూరు నియోజకవర్గంలోని అగ్రిగోల్డ్ భూముల్లోని వృక్ష సంపదపై ఓ కూటమి కన్నేశాడు. తన అనుచర గణాన్ని దింపి వృక్ష సంపదను ఇష్టారాజ్యంగా నరికివేస్తున్నాడు. కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ఇలా తన నియోజకవర్గంలో ఆయన పెత్తనం ఏందని.. స్థానిక ప్రజాప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల వృక్ష సంపద నరుకుతున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి పట్టించేశాడు. ఈ వ్యవహారం ఇప్పుడు గూడూరు నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది.

పాత అగ్రిమెంట్లతో ముందుకు

ఎగువరాజుపాళెంలో అగ్రిగోల్డ్ సంస్థ కొనుగోలు చేసిన భూములతో పాటుగా ఆ ప్రాంతంలో ఉన్న అసైన్‌మెంట్ భూములు, వాగులు, వంకలు ఉన్న సుమారు 250 ఎకరాలు సంస్థ అధీనంలోనే ఉన్నాయి. ఆ భూములు రిజిస్ట్రేషన్ కావు కాబట్టి సంస్థ అగ్రిమెంట్లు మీద ఆ భూములు స్వాధీనం చేసుకుని ఉంది. ఈ భూములు నేడు ఎకరా లక్షల్లో పలుకుతోంది. వీటిని సంస్థ కన్నా ముందుగా రైతు నుంచి తాము అగ్రిమెంట్లు చేసుకున్నట్లు చూపి స్వాధీనం చేసుకునేందుకు పెద్ద స్కెచ్ వేస్తున్నారు. అయితే ఈ భూములకు సంబంధించిన పూర్తి వివరాలను రెవెన్యూ అధికారులు అందిస్తే వాటిని అప్పట్లో ఏ రైతు అధీనంలో ఉన్నాయో చూసి వారి వద్ద నుంచి తమ పేరుతో అగ్రిమెంటు చేసుకునేలా సదరు కూటమి నేత సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

భూములు కొట్టేయాలని కుట్ర

అగ్రి గోల్డ్ భూములు ఇప్పటికే సీఐడీ పరిధిలో ఉన్నాయి. అందులోని లొసుగులను వెలికి తీసి గతంలో సంస్థకు అగ్రిమెంటు చేసిన స్థానికుల వద్ద నుంచి ఆ భూములు తమకు అగ్రిమెంటు చేసినట్లు సృషించుకునేందుకు ఎత్తుకు పై ఎత్తు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే స్థానిక రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం.



అగ్రి గోల్డ్ భూముల్లో నరికి వేసిన కలప

ఆ వ్యవహారంతోనే వేడుకలకు దూరం?

చిల్లకూరు మండలం, ఎగువరాజుపాళెంలోని అగ్రిగోల్డ్ భూములను స్వాధీనం చేసుకునేందుకు కూటమి నేత తన అనుచరులను దింపడంతో స్థానిక ప్రజాప్రతినిధి ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై కూర్చుని చర్చించుకోవాలనుకుని అనుకున్నారు. ఇందుకు కూటమి నేత కుటుంబ సభ్యుల పుట్టిన రోజు వేడుకలను వేదికగా మలుచుకున్నారు. కానీ ఆ వేడుకలకు హాజరు కవాల్సి వస్తుందని గత గురువారం రాత్రి తన కార్యాలయం నుంచి నాలుగు రోజుల పాటు తాను అందుబాటులోఉండనని స్థానిక ప్రజాప్రతినిధి మెసేజ్‌లు పంపడం చర్చనీయాంశమైంది.

వందల ఎకరాల స్వాధీనానికి స్కెచ్

గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు మండలంలో అగ్రిగోల్డ్ సంస్థ కొన్ని సంవత్సరాల క్రితం ఎగువరాజుపాళెం, వరగలి క్రాస్‌రోడ్డు, ఓజిలి మండలం భువనగిరిపాళెం తదితర ప్రాంతాల్లో మధ్య తరగతి వారి భూములను కొనుగోలు చేసింది. అటు తరువాత సంస్థ వరగలి క్రాస్ రోడ్డుతో పాటుగా ఎగువరాజుపాళెం వద్ద వెంచర్‌లు వేసి పెద్ద విక్రయాలు చేపట్టింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలలో డిపాజిట్‌దారులు సంస్థపై ఫిర్యాదులు చేయడంతో కథ అడ్డం తిరిగింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అగ్రి గోల్డ్ భూముల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోక మిన్నకుండిపోతోంది. ఇదే అదునుగా స్థానికంగా ఉండే కూటమి నేత ఆ భూములపై కన్నేశాడు. గతంలో సంస్థ రిజిస్ట్రేషన్ చేసుకోకుండా అగ్రిమెంట్ల మీద స్వాధీనం చేసుకున్న అసైన్‌మెంట్, వాగులు, వంకలు ఉన్న భూములను దక్కించుకునేందుకు స్కెచ్ వేశారు. ఇందులో భాగంగానే అగ్రి గోల్డ్ భూముల్లో ఉన్న ఎర్రచందనం, టేకు, జామాయిల్ చెట్లు నరికి వాటిని విక్రయించుకునేందుకు తన అనుచరగణాన్ని రంగంలోకి దింపాడు. అయితే ఈ విషయం తనకు తెలియకుండానే భూములు సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందడంతో స్థానిక ప్రజాప్రతినిధి పోలీసులకు ఉప్పు అందించారు. ఈ విషయం బయటకు పొక్కడంతో కూటమినేత, ప్రజా ప్రతినిధి మధ్య కొంత గ్యాప్ ఏర్పడినట్లు చర్చజరుగుతోంది.

అగ్రిమెంట్ల ద్వారా స్వాధీనం చేసుకునేందుకు విశ్వ ప్రయతాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే స్థానిక నాయకుల సహకారంతో 50 ఎకరాల్లో ఉన్న జామాయిల్ చెట్లను నరికి తరలించే ప్రయత్నం చేశారు. అదే సమయంలో పోలీసులు మూడు లారీలను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత కూటమి నేత ఒత్తిడితో రెండు లారీలను వదలి వేసి ఒక లారీపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

105 ఎకరాల్లో వెంచర్లు

చిల్లకూరు మండలం, ఎగువరాజుపాళెం గ్రామంలోని వివిధ సర్వే నంబర్లలోని 500 ఎకరాల్లో అగ్రిగోల్డ్ భూములు కొనుగోలు చేసింది. ఈ భూముల్లో 105 ఎకరాల వరకు వెంచర్లు వేసి విక్రయాలు చేపట్టింది. అలాగే ఆ భూముల్లో ఉన్న వాగులు, వంకలు, పోరంబోకు భూములు సుమారు 150 ఎకరాలతో పాటుగా స్థానికంగా ఉండే పేదలు సాగు చేసుకునే భూములు, గ్రామ సేవకులకు పంపిణీ చేసిన మరో 50 ఎకరాలు ఉన్నాయి.

వివాదాస్పద భూములపై కన్ను

ఈ భూములు వివాదస్పదంగా ఉండడంతో వీటిపై కన్నేసిన కూటమి నేత స్థానిక నాయకుల ద్వారా వాటి వివరాలు తెలుసుకున్నారు. అంతే స్థానిక నాయకుల ద్వారా పావులు కదిపి వాటిని పాత

> ### సీఐడీ ఆధీనంలో ఉన్నాయి
>
> చిల్లకూరు మండలం, ఎగువరాజుపాళెం, వరగలి క్రాస్ రోడ్డు ప్రాంతాల్లోని అగ్రి గోల్డ్ భూములకు సంబంధించిన పూర్తి వివరాలు సీఐడీ చేతిలో ఉన్నాయి. ఆ భూముల్లో ఏవైనా ఆక్రమణలు, వృక్ష సంపదతో పాటుగా, సహజ సంపదను కాపాడేందుకు మాత్రం తమ శాఖ ద్వారా పర్యవేక్షణ చేస్తుంటాం.
>
> – శ్రీనివాసులు, తహసీల్దార్, చిల్లకూరు

> ### గుర్తు తెలియని వ్యక్తులపై కేసు
>
> ఎగువరాజుపాళెం గ్రామంలోని అగ్రి గోల్డ్ భూముల్లో అక్రమంగా జామాయిల్ చెట్లు నరికి వేసినట్లు ఫోన్ వచ్చింది. మా సిబ్బంది అక్కడికి చేరుకుని జామాయిల్ లోడ్‌తో ఉన్న ఒక లారీతో పాటుగా మరో రెండు లారీలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అటు తరువాత రెండు ఖాళీ లారీలను వదలి వేశాం. స్థానిక వీఆర్వో గుర్తు తెలియని వ్యక్తులు అని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం.
>
> – కిషోర్‌బాబు, సీఐ, గూడూరు రూరల్

ఆక్రమణలపై అలెర్ట్

- అటవీ భూముల వద్ద భారీగా పోలీసుల మోహరింపు



పోలీసులకు సూచనలిస్తున్న గూడూరు డీఎస్పీ గీతాకుమారి

దక్కిలి: దక్కిలి మండలం, వెంకటగిరి–రాపూరు జాతీయ రహదారిలోని మోపూరు రోడ్డు సమీపంలో ఉన్న సర్వే నం–1లో అటవీ భూములను ఆక్రమిస్తారన్న సమాచారంతో అటవీ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు అలెర్ట్ అయ్యారు. సోమవారం భారీ ఎత్తున మోపూరురోడ్డు అటవీశాఖ చెక్ పోస్టు వద్ద మొహరించారు. గూడూరు డీఎస్పీ గీతాకుమారి పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోర్టు మెట్లెక్కిన భూవివాదం

గత ఏడాది మోపూరు రోడ్డు సమీపంలోని అటవీ భూములను మోపూరురోడ్డు, సూరాయిపాళెం, తిమ్మాయిపాళెం గ్రామాల్లోని ఎస్టీలు ఆక్రమించి చదును చేశారు. అప్పట్లో అటవీశాఖ అధికారులు ఆక్రమణదారులపై కేసులు నమోదు చేశారు. అనంతరం ఏడాదిగా ఆ భూముల్లోకి ఎవ్వరూ ప్రవేశించలేదు. ఈ క్రమంలో తాము సాగు చేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని ఎస్టీలు న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. ఈ వ్యవహారం కోర్టులో నడుస్తోంది. ఈ నెల 13వ తేదీన చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 100 మంది ఎస్టీలు మళ్లీ అటవీ భూములను వాక్రమించేందుకు ప్రయత్నించారు. ఈ భూముల వ్యవహారం కోర్టులో నడుస్తోందని, ఎవ్వరూ ప్రవేశించరాదని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు.

చర్యలు తప్పవు

అటవీ భూముల జోలికి వస్తే తగిన విధంగా వ్యవహరిస్తామని ఎఫ్ఆర్ఓ లోకేష్, డీఆర్వో ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. అటవీశాఖ పరిధిలో ఎక్కడ కూడా సెంటు భూమి అన్యాక్రాంతం కాకుండా చూస్తామన్నారు.



అటవీ అక్రమణపై ఎఫ్ఆర్వో లోకేష్‌తో చర్చిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

పోలీసు పికెట్

మోపూరోడ్డు వద్ద ఈ నెల 19వ తేదీ వరకు పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేశారు. అటవీ భూముల్లోకి ఎవరైనా ప్రవేశిస్తే నాన్ బెయిల్‌బుల్ సెక్షన్‌లు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఆక్రమణలను అడ్డుకునేందుకు గూడూరు డీఎస్పీ గీతాకుమారి, వెంకటగిరి సీఐ ఏవీ.రమణ, డక్కిలి తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు, వెంకటగిరి ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్వో లోకేష్, డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి, గూడూరు ఎస్ఐలు శివశంకర్, కామినేని గోపి, డక్కిలి, బాలాయపల్లి డీఆర్వోలు ఏవీ కోటేశ్వరరావు, ప్రతాప్‌రెడ్డి, సుహసిని పాల్గొన్నారు.

144 సెక్షన్ అమలు

ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు మోపూరురోడ్డు, తిమ్మాయిపాళెం, సూరాయిపాళెం గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేశారు. అంతేగాక అటవీ భూముల్లో ఎవ్వరూ ప్రవేశించకుండా 145 సెక్షన్ కూడా విధించారు. ఆక్రమణ వ్యవహారం మళ్లీ కొనసాగుతుందని ముందుస్తుగా అందిన సమాచారం మేరకు పోలీసు, అటవీశాఖ అధికారులు మోపూరోడ్డులో మోహరించారు. 150 మంది పైగా బలగాలు చేరుకుని పలు బృందాలుగా విడిపోయి పర్యవేక్షించాయి. నాలుగు వైపులా వాహనాలను తనిఖీ చేశారు.

రుణాలకు 17,461 దరఖాస్తులు

తిరుపతి అర్బన్: బీసీ కార్పొరేషన్, స్వయం ఉపాధి రుణాలకు సంబంధించి జిల్లాలో 1,979 యూనిట్లకు 17,461 దరఖాస్తులు అందినట్టు ఈడీ శ్రీదేవి వెల్లడించారు. ఆ మేరకు దరఖాస్తులను కసరత్తు చేస్తున్నట్లు వివరించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో రద్దీ సాధారణంగా ఉంది. టీటీడీ అధికారుల సమాచారం మేరకు స్వామి వారి సర్వదర్శనం సుమారు 8 గంటల సమయం పట్టే అవకాశం ఉంది.

సమ్మె విరమించే ప్రసక్తేలేదు



పశువైద్యశాల ఎదుట నిరసన తెలుపుతున్న జూడాలు

తిరుపతి సిటీ: సమ్మె విరమించేది లేదని ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో జూడాలు భీష్మించుకున్నారు. ఆదివారం మంత్రి లోకేష్‌కు రేణిగుంట ఎయిర్‌పోర్టులో కలసి వినతిపత్రం సమర్పించిన జూడాలు శాంతించలేదు. గౌరవ వేతనం పెంచేవరకు సమ్మె నుంచి తగ్గేదేలేదని హెచ్చరిస్తున్నారు. సోమవారం 15వ రోజు సమ్మెలో భాగంగా వర్సిటీలో వైఎస్సార్ పరిపాలనా భవనాన్ని మరో మారు ముట్టడించారు. అనంతరం వర్సిటీలో పుశువైద్య కళాశాల ఎదుట ఓపీ, ఓటీలను స్తంభింపచేసి నిరసన తెలిపారు.

మహాశివరాత్రికి ప్రత్యేక సర్వీసులు

తిరుపతి అర్బన్: 'ఓ వైపు ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. మరోవైపు ఆదాయాన్ని పెంచడానికి ప్రత్యేక శ్రద్ధపెట్టాలి' అని డీపీటీవో నరసింహులు డీఎంలకు సూచించారు. అలిపిరి డిపోలో సోమవారం జిల్లాలోని 11 ఆర్టీసీ డిపోల మేనేజర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఆదాయంలో గత ఆరేళ్లుగా ముందు వరుసలో ఉంటున్న విషయాన్ని గుర్తుచేశారు. అలాగే ఈ ఏడాది నంబర్ వన్ స్థానంలో ఉండాలంటే అంతా కష్టపడి పనిచేయాలని చెప్పారు. అంతేతప్ప కార్యాలయానికి పరిమితమైతే కుదరదని స్పష్టం చేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

విద్యుత్ బస్సుల నిర్వహణపై అవగాహన

భవిష్యత్‌లో అన్ని డిపోలకు విద్యుత్ సర్వీసులు వచ్చే అవకాశం ఉన్న క్రమంలో ప్రతి డీఎంకి వాటి నిర్వహణ అంశాలపై అవగాహన కల్పించారు. హైదరాబాద్‌కి చెందిన వీఎస్ఆర్ అండ్ విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఓ ఇంజినీరింగ్ బృందం డీఎంలకు విద్యుత్ సర్వీసులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీటీఎం విశ్వనాథం, డీఎంలు హరిబాబు, బాలాజీ, భాస్కర్‌రావు, మునిచంద్ర, పుష్పలత, ప్రభాకర్ పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.88,120
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,943
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.98,800
రిటైల్ వెండి గ్రాము	రూ.101.80

క్లుప్తంగా

సీఎం చంద్రబాబుకు సాదర స్వాగతం


సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): అంతర్జాతీయ దేవాలయాల కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి సాదర స్వాగతం లభించింది. రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఈఓ శ్యామల రావు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు, కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ శుభం బన్సల్, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ, కోనేటి ఆదిమూలం, కురుగొండ్ల రామకృష్ణ, భానుప్రకాష్, మురళీమోహన్, డా.వీయం. థామస్, మాజీ ఎంఎల్ఏ సుగుణమ్మ, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీఓలు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ఆయన తిరుపతికి రోడ్డు మార్గాన పయనమయ్యారు.

సీఎంకు సాదర వీడ్కోలు

రేణిగుంట విమానాశ్రయంలో సీఎం చంద్రబాబునాయుడుకు సాదర వీడ్కోలు లభించింది. మంత్రితోపాటు టీటీడీ ఈఓ ఇతర అధికారులు ఆయనకు వీడ్కోలు పలికారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నాగలాపురం: రేషన్ బియ్యాని అక్రమంగా తరలిస్తున్న లారీని సోమవారం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ పోలీసుల ఆధ్వర్యంలో రేషన్ బియ్యం తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచారు. సోమవారం తెల్లవారు జామున స్థానిక తూర్పు దళితవాడలో 3 గంటల ప్రాంతంలో రేషన్ బియ్యాన్ని లారీలో లోడింగ్ చేస్తుండగా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఆపై లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీలో 220 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. వీటి విలువ రూ.3.52 లక్షలు ఉంటుందని తెలిపారు. అనంతరం రేషన్ బియ్యాన్ని తహసీల్దార్‌కు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సునీల్ తెలిపారు.

సహనానికి సర్వర్ పరీక్ష!

- వనిచేయని సర్వర్
- గంటల తరబడి నిరీక్షణ
- రీ వెరిఫికేషన్ కేంద్రాల వద్ద పడిగాపులు
- దివ్యాంగుల కష్టాలు వర్ణనాతీతం


నేల మీదే కూలబడి


కుర్చీలు 20.. వికలాంగులు 150 మంది.. ఇదీ పరిస్థితి

తిరుపతి తుడా: దివ్యాంగులకు ప్రభుత్వం మరోమారు పరీక్ష పెడుతోంది. వైకల్యంతో అవస్థలు పడుతున్నారనే కనికరం కూడా లేకుండా వేధిస్తోంది. పింఛన్ సొమ్ముతో పొట్ట పోసుకొనే వారి ఆత్మాభిమానం పై దాడి చేస్తోంది. పింఛన్‌దారుల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా వ్యూహం రచిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ వైద్యుల చేత సదరం సర్టిఫికెట్లను పొంది వారికి మరోమారు పరీక్ష పెడుతోంది. గడిచిన నెల రోజులుగా వారంలో తొలి మూడు రోజులు సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ నిర్వహిస్తోంది. వ్యయ ప్రయాసలకోర్చి మరోమారు తమ వైకల్యాన్ని నిరూపించుకునేందుకు లబ్ధిదారులు క్యూ కడుతున్నారు. దీంతో తిరుపతి రుయా ఆస్పత్రి కిక్కిరిసిపోతోంది.

వసతుల ఏర్పాట్లలో నిర్లక్ష్యం

సదరం ఫ్రీ వెరిఫికేషన్ కోసం రోజుకు 150 నుంచి 200 మంది దివ్యాంగులు రుయా ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. అయితే దివ్యాంగులకు కనీస వసతులను కల్పించడంలో ప్రభుత్వం చేతులెత్తేసింది. సదరం రీ వెరిఫికేషన్ క్యాంపుల పర్యవేక్షణ బాధ్యతలను డీఆర్డీఏకు ప్రభుత్వం అప్పగించింది. ఆ శాఖ అధికారులు ఆటు వైపు కన్నెత్తి చూడడం లేదు. ఒక షామియానా, 20 కుర్చీలు వేసి చేతులు గెలుపుకున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు దివ్యాంగులు అక్కడే ఉండాల్సి వస్తోంది. కనీసం తాగునీటి సౌకర్యాన్ని కూడా కల్పించకపోవడం విమర్శలకు తావిస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి విధులు కోసం వచ్చిన డాక్టర్ల పట్ల కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. వారికి వసతి, ట్రాన్స్‌ఫోర్ట్, భోజన సౌకర్యాలను కల్పించకపోవడం వారి నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతోంది.

గంటల తరబడి నిరీక్షణ

సదరం వెరిఫికేషన్ కోసం వచ్చిన దివ్యాంగులకు నిరీక్షణ తప్పడం లేదు. కొన్ని సమయాల్లో సర్వర్ మొరాయిస్తుండడంతో రీ వెరిఫికేషన్ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. సౌకర్యాల లేమి, నిరీక్షణతో మరింత వేదనకు గురవుతున్నారు.

ఆస్టర్ నారాయణాద్రిలో 500 హార్ట్ బైపాస్ సర్జరీలు

తిరుపతి తుడా: ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో 500 బైపాస్ సర్జరీలను విజయవంతంగా పూర్తి చేసినట్లు సీటీవీఎస్ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ పీ.త్రిలోక్ తెలిపారు. సోమవారం ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్టర్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ఏడాదిన్నరలో 500 గుండె బైపాస్ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేసినట్టు వెల్లడించారు. ఎంతో క్లిష్టమైన కేసులను సైతం 99.9 శాతం సక్సెస్ రేట్‌తో పూర్తి చేశామన్నారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సునందకుమార్ రెడ్డి మాట్లాడుతూ సీటీవీఎస్ విభాగం ప్రారంభించిన మొదటి 50 రోజుల్లో 50 కేసులు విజయవంతం గా చేశామన్నారు. ఈ విజయాల వెనుక అనుభవజ్ఞులైన వైద్యులు ఉండడమే కారణమన్నారు. సెపరేట్ కార్డియాక్ ఐసీయూ అలానే పోస్ట్ ఆపరేటివ్ కేర్ సెంటర్ ఉండడం కారణమని తెలిపారు. ఆస్పత్రి సీఓఓ డాక్టర్ శ్రీధర్ ముని మెరుగైన ఆధునిక వైద్యాన్ని అందిస్తుండడంతోనే ఆస్పత్రి దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. డాక్టర్ ఎస్వీ ప్రసాద్, డాక్టర్ శ్రీకాంత్, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ ప్రతిమ, చీఫ్ మెడికల్ సర్వీసెస్, డాక్టర్ సుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

వర్కర్స్ జేఏసీ జిల్లా కమిటీ ఎంపిక


నాగ వెంకటేష్


ఏ.ప్రదీప్‌కుమార్

తిరుపతి కల్చరల్: ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ మేరకు సోమవారం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఏవీ.నాగేశ్వరరావు, శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి సమక్షంలో ఈ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జేఏసీ జిల్లా చైర్మన్‌గా గండికోట నాగ వెంకటేష్, కో–చైర్మన్లుగా బాబు, ఎస్.మొయిద్దీన్, పి.వరలక్ష్మి, మునికృష్ణయ్య, గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎ.ప్రదీప్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా జి.చిన్నబాబు, ఎస్.జయచంద్ర, వైస్ చైర్మన్లుగా ఎస్.సుభాన్, అమర్నాథ్, చెంగల్రాయులు, సుబ్బారాయుడు, రాము, లోకేష్‌బాబు, ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారిగా టి.కుమార్, కార్యదర్శులుగా మహేష్, నారాయణమ్మ, నరసింహులు, రేఖ, ఈశ్వర్‌రెడ్డితో పాటు 16 మంది కమిటీ సభ్యులను ఎంపిక చేశారు.

ఎల్ఎల్ఎమ్ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన ఎల్ఎల్ఎమ్ వైవా, డెమోకు సంబంధించిన ఫలితాలు సోమవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎం దామ్లా నాయక్ తెలిపారు. ఫలితాల కోసం విద్యార్థులు వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తిని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు (ఇన్‌సెట్) రైలు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

నాయుడుపేట టౌన్: నాయుడుపేట రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సూళ్లూరుపేట రైల్వే పోలీసుల కథనం.. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి తాంబరానికి వెళుతున్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలు నాయుడుపేట రైల్వే స్టేషన్‌కు వచ్చే సమయంలో స్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా ఓ వ్యక్తిని ఢీకొంది. ఈ ఘటనలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సూళ్లూరుపేట రైల్వే ఎస్ఐ వై.చెన్నకేశవ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. సుమారు 25 సంవత్సరాల వయస్సు కలిగి, ఆరంజ్ కలర్ ఫుల్ హ్యాండ్ టీ షర్టు, నలుపు రండు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. చెతిపై ఒడిశా భాషలో లా అని రాసుకుని ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో భద్రపరిచారు. మృతుని ఆధారాలు తెలిస్తే 70134 13616 , 70360 43535కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు.

వేమన పద్యాలతో జీవితం సార్థకం


సదస్సులో మాట్లాడుతున్న వీసీ సీహెచ్ అప్పారావు

తిరుపతి సిటీ: వేమన పద్యాలు నిత్య జీవితంలో ప్రతి వ్యక్తి ఆచరించదగినవని, వీటితో జీవితం సార్థకమవుతుందని వీసీ సీహెచ్ అప్పారావు పేర్కొన్నారు. ఎస్వీయూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వర్సిటీ సెనేట్ హాల్లో సోమవారం వేమన శూన్యవాదం అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధాన వక్త విశ్రాంత ఆచార్యులు శివారెడ్డి మాట్లాడుతూ వేమన సాహిత్యంలో శూన్యవాదం గురించి వివరిస్తూ ప్రస్తుత భౌతిక శాస్త్రంలో ఆచరిస్తున్న క్వాంటం ఫిజిక్స్‌కి ప్రతిరూపమన్నారు. వేమన పద్యాలు జాతి, కుల, మత భేదాలు లేకుండా దక్షిణ భారతంలో తెలుగు, తమిళం కన్నడ, కేరళ, సింహాలం భాషల్లోనూ, సంప్రదాయాల్లోనూ ఇప్పటికీ కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి ప్రొఫెసర్ సరిత, వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కేటి రామకృష్ణారెడ్డి, రమేష్, పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మునిరత్నం రెడ్డి, తెలుగు అధ్యయన శాఖ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి.. కొల్లగొట్టి!

సత్యవేడులో సరిహద్దులు దాటుతున్న ఎర్రమట్టి

- చోద్యం చూస్తున్న పోలీస్, రెవెన్యూ
- అడ్డొస్తారని అకారణంగా తహసీల్దార్ బదిలీ
- ఇదే అదునుగా వందల లారీల ఎర్రమట్టి సరిహద్దులు దాటింపు
- తొండుకొలి గ్రామం కేంద్రంగా గ్రావెల్ అక్రమ వ్యాపారం
- మండల టీడీపీ కీలక నేతల కనుసన్నల్లో గ్రావెల్ దందా


సత్యవేడు మండలం, తొండుకొలి గ్రామం వద్ద యంత్రాలతో మట్టి తవ్వకాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: సరిహద్దు ప్రాంతమైన సత్యవేడు కేంద్రంగా టీడీపీ నేతల కనుసన్నల్లో గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. గత మూడు రోజులుగా వందలాది టిప్పర్ల ఎర్రమట్టి తమిళనాడుకు అక్రమ రవాణా అవుతోంది. ఇంత జరుగుతున్నా పోలీస్, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. స్వయాన ఈ అక్రమ గ్రావెల్ దందా సత్యవేడు మండల టీడీపీ కీలక నేత కనుసన్నల్లో జరుగుతుండడంతో అటువైపు రావాలంటేనే జంకుతున్నారు. ఈ అక్రమార్జనను ఓర్చుకోలేని అదే టీడీపీలోని మరో వర్గం స్వయాన గ్రావెల్ మాఫియా గురించి సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేయడం గమనార్హం. ఈ తంతు పూర్తిగా సత్యవేడు మండలం, మదనంజేరి పంచాయతీ, తొండుకొలి గ్రామం కేంద్రంగా సాగుతోంది. ఈ గ్రామం తమిళనాడుకు కూతవేటుకు దూరంలో ఉండడంతో టీడీపీ నేతల అక్రమ దందాకు అనుకూలంగా మారింది. తొండుకొలి గ్రామ లెక్కల దాఖలాల్లో సర్వే నం.180లో మేతబీడు భూమిగా ఉన్న ప్రాంతంలో వందలాది టిప్పర్ల ద్వారా హిటాచీ యంత్రాలతో తవ్వకాలు జరిపి తమిళనాడుకు తరలిస్తున్నారు. అక్కడ ఒక్కో టిప్పర్ రూ. 40వేలకు పైమాటే. దీంతో కోట్లాది రూపాయలు జేబులు నింపుకునేందుకు సత్యవేడు టీడీపీలోని ముఖ్య నేతలకు ఎర్రమట్టి వ్యాపారం వరంగా మారింది.

అందుకేనా సత్యవేడు తహసీల్దార్ బదిలీ?


నాలుగు రోజుల క్రితం అకారణంగా సత్యవేడు తహసీల్దార్ సుబ్రమణ్యంను జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. రెండు నెలల క్రితం ఈ అక్రమ గ్రావెల్ రవాణాను మొదలు పెట్టారు. ఆ సమయంలో తహసీల్దార్ అడ్డుపడి కొన్ని లారీలను సీజ్ చేశారు. దీంతో పలు పర్యాయాలు గ్రావెల్ అక్రమ రవాణాకు ప్రయత్నం చేసినప్పటికీ ఎప్పటికప్పుడు అడ్డుకట్ట వేయడంలో తహసీల్దార్ చూపిన చొరవే నేడు బదిలీకి కారణమైంది. దీంతో నాలుగు రోజుల క్రితం అకారణంగా సత్యవేడు తహసీల్దార్‌ను బదిలీ చేసి వరదయ్యపాళెం తహసీల్దార్ రాజశేఖర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. అయితే దీన్ని అదునుగా భావించిన మండల టీడీపీ కీలక నేతలు మూడు రోజుల నుంచి గ్రావెల్ అక్రమ రవాణాను చకచకా ప్రారంభించారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఎర్రమట్టి లారీలను సరిహద్దులు దాటించేస్తున్నారు. అయితే వీరికి స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేక వర్గీయులు అండ ఉన్నట్లు సమాచారం.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


తిరుపతి పార్లమెంట్ పరిధిలోని ప్రజాసమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి పేర్కొన్నారు. తిరుపతి ఎంపీ కార్యాలయంలో సోమవారం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు వారి సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిశీలించిన ఎంపీ గురుమూర్తి పార్లమెంట్ పరిధిలోని ప్రజాసమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ ముందుంటానని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం ఆయా నియోజకవర్గ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆయన ఫోన్ చేసి సూచించారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో మినహా మిగిలిన రోజుల్లో తిరుపతిలోని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

స్విమ్స్ న్యాయ సలహాదారుడిగా వెంకటనారాయణ


ఎస్.వెంకటనారాయణ, స్విమ్స్ న్యాయ సలహాదారు

తిరుపతి లీగల్: స్విమ్స్ ఆస్పత్రి న్యాయ సలహాదారుడుగా ఎస్.వెంకట్‌నారాయణను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన జిల్లా డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా, తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహించి గత ఏడాది ఉద్యోగ విరమణ చేశారు. జిల్లాలో పలుచోట్ల పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, న్యాయవాదిగా విధులు నిర్వహించారు. ఆయన నియామకం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ఆ నియామకాలు రాజ్యాంగ విరుద్ధం


స్విమ్స్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి తుడా: స్విమ్స్‌లో ఇటీవల నాలుగు రేడియోలాజిస్ట్ ఫిజిక్స్ (మెడికల్ ఫిజిసిస్ట్) లెక్చరర్ పోస్టుల నియామకాలు మత ప్రాతిపదికన భర్తీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్విమ్స్ ఆస్పత్రి వద్ద విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్విమ్స్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. విద్యార్థి సంగాల నాయకులు మాట్లాడుతూ మత ప్రాతిపదికన చేపట్టే నియామకాలు సిగ్గు మాలిన చర్య అని, ఇది టీటీడీ సంస్థకే అవమానమని మండిపడ్డారు. అర్హత గల అందరికీ రాజ్యాంగ బద్ధంగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బండి చలపతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు ఉదయ్, ప్రవీణ్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, బీసీ విద్యార్థి నాయకులు విజయ్, తిరుమలేష్, జీఎస్ఎన్ శివ శంకర్ నాయక్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అరటి ఆకు మాయం


ఆలయ అన్న దానంలో కాగితపు ప్లేట్లల్లో వడ్డిస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ అన్నదానంలో అరటి ఆకులో భోజనం ఏర్పాటు చేయాలని భక్తులు భూరి విరాళాలు ఇస్తుంటారు. అయితే భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా శ్రీకాళహస్తీశ్వరాలయ అన్నదానంలో అరటి ఆకులకు బదులుగా అట్ట ప్లేట్లలో భోజనం ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా కూర్చునే అవకాశం లేకపోవడంతో భక్తులు నిలబడే భోజనం చేస్తున్నారు. దీనిపై పలువురు భక్తులు పెదవి విరుస్తున్నారు.

పరిశోధనలో పరస్పర సహకారం


యూఎస్ఏ ప్రతినిధిని సన్మానిస్తున్న హెడ్ దేవప్రసాద్‌రాజు

తిరుపతి సిటీ: పరిశోధనలో ఎస్వీయూ, అమెరికాలోని పార్డు యూనివర్సిటీ పరస్పర సహకారం అందించుకోనున్నట్లు యూఎస్ఏ ప్రతినిధి జూలియానా కస్తవస్ తెలిపారు. ఆమె సోమవారం ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాన్ని సందర్శించారు. ఆ విభాగం హెడ్ ప్రొఫెసర్ దేవప్రసాద్ రాజు, ఇతర ప్రొఫెసర్లతో ఆమె సమావేశమయ్యారు. గతంలో వర్సిటీతో తమ యూనివర్సిటీ ఎంఓయూ చేసుకుందనీ, ఈ ప్రకారం బోధన, పరిశోధన విషయాల్లో పరస్పరం సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం జూలియానా కస్తవస్‌ను ఫిజిక్స్ అధ్యాపకులు జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు విజయలక్ష్మి, అపర్ణ, రుద్రమదేవి పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించండి

తిరుమల: ముంబైలో అమ్మవారి ఆలయం, టీటీడీ సమాచార కేంద్రాన్ని నిర్మించేందుకు స్థలం కేటాయించాలని కోరుతూ టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ద్వారా మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం తిరుపతిలో ఆయనను కలసి విన్నవించారు. ఇప్పటికే నవీ ముంబైలో ఉల్వే ప్రాంతంలో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం 3.61 ఎకరాల స్థలాన్ని లీజు ప్రాతిపదికన కేటాయించారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. మరో 1.5 ఎకరాల స్థలంలో అమ్మవారి ఆలయాన్ని కూడా నిర్మించాలని టీటీడీ నిర్ణయించిందని, ఈ మేరకు స్థలాన్ని కేటాయించాలని, బాంద్రాలో టీటీడీ సమాచార కేంద్రానికి కొంత స్థలాన్ని కేటాయించాలని టీటీడీ మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.